

# దారుణం

వి. రాజారామమోహనరావు

గట్టుతెగిన నీరంత కంగారుగా నడుస్తున్నారు జనం. అసలే ఆ రోడ్డుకి హడావిడిఎక్కువ. అందులో మరో అరగంటకి చాలా ఆఫీసులు మొదలయ్యే ఆ సమయం మరింత హడావిడి పెంచింది.

ముకుందరావు ముందుకి చూట్టంలేదు. వెనక్కి చూట్టంలేదు... పైకి చూట్టంలేదు... ప్రత్యేకంగా ఏ వేపూ చూట్టంలేదు. కళ్ళు తెరిచే వున్నాయి—చూస్తూనే వున్నాడు... ఆ హడావిడిలో నడుస్తూనే వున్నాడు. ఆరోజేనా ఆఫీసుకి కంగారు లేకుండా వెళ్దామని తొందరగా బైల్దేరాడు యింట్లో. ఎక్కిన బస్ మధ్యలో ఫెయిలవటం వల్ల నడుస్తున్నాడు.

ఆఫీసుకి ఆలస్యమవుతుందన్న హడావిడి లేదు. నడిచి వెళ్ళినా సమయం సరిపోతుందని ధీమాగా వుంది. పైగా మేనేజర్ హఠాత్తుగా కేంప్ వెళ్ళాడన్న వార్త బసెక్కుతుండగా అంతకు ముందే ఆఫీసు ప్యూన్ ద్వారా తెలిసింది.

నెమ్మదిగా, తాపీగా నడవాలని అప్పటికి రెండు మూడుసార్లు అనుకున్నాడు ముకుందరావు. అయినా కంగారుకి అలవాటు పడ్డ కాళ్ళు మామూలుగానే నడుస్తున్నాయి.

స్పీడు తగ్గినా ఒకటిరెండు క్షణాలే. కాస్సేపు కాళ్ళవేపు చూస్తూ నడిచాడు. అలా చూస్తూ... చూస్తూ ముందు నడుస్తున్న కాళ్ళని పక్కన నడుస్తున్న కాళ్ళని చూశాడు.

'ఎంత కంగారు...ఎంత ఆత్రం...ఎన్ని రకాల తొందర...తెల్లారి లేచిందగ్గరనుంచి మళ్ళీ పడుకునే వరకు ఎంత తాపత్రయం...'

కాళ్ళ వేపు చూసి చూసి గబుక్కుని తలెత్తిన ముకుందరావుకి ఓ రెప్పపాటు మనుషులందరూ చిత్రంగా కనిపించారు.

కాళ్ళు వేరుగా, మనుషులు వేరుగా, ముఖాలు వేరుగా...యిష్టాలు వేరుగా... చేతలు వేరుగా...

'ఛత్' అనుకున్నాడు ఆలోచనని మధ్యకి తుంచేస్తూ...

కనుచూపు దూరంలో ఓవర్ బ్రిడ్జ్...

'అది దాటితే ఆఫీసు...' అనుకుంటూ నడిచాడు ముకుందరావు. బ్రిడ్జి యింక వంద గజాల్లో వుందనగా కనపడింది గుంపు...'ఏదో యాక్సిడెంట్ అయిన ట్టుంది...' అనుకున్నాడు.

> లండన్ ప్రజలు **1950** సెప్టెంబర్ 26వ తేదీన ఆకుపచ్చ సూర్యుని చూసారు. కొంత సేపు తర్వాత సూర్యుని రంగు నీలి రంగుగా మారిపోయింది. ఆ రాత్రి చంద్రుడు కూడా నీలంగా కనిపించాడు. ఈ వింతకు ప్రజలు విపరీతంగా ఆశ్చర్యపోయారు. దీనికంతకూ కొన్ని ఫ్యాక్టరీల పొగలు కారణమని, ఆ పొగలలోనుంచి చూడటంవల్ల సూర్యుడు, చంద్రుడు ఆవిధంగా కనిపించారని ఆ తర్వాత తెలుసుకున్నారట.

మరీ దగ్గరకెళ్ళినా ఏం కనపడలేదు ముకుందరావుకి; మునిగాళ్ళమీద పైకిలేచి ముందున్న భుజాల సందుల్లోంచి, తలల లోంచి చూడాలని ప్రయత్నం చేశాడు... ఏం కనపళ్ళేదు. 'ఏమిటో...ఏమైందో...'

"ఏమైంది..." అనడిగాడు గుంపులోంచి బైటకొస్తున్నతన్ని...

"ఎవడో మరి...చూడండి..." అంటూ వెళ్ళిపోయాడతను.

మరో యిద్దరు గుంపులోంచి వెళ్ళిపోతుంటే అడిగాడు "యాక్సిడెంటా..." అని కాదని తలూపారు తప్ప వివరాలేం చెప్ప లేదు.

'యాక్సిడెంటు కాకపోతే యింత హడావిడిలో యింత మంది జనం ఎందుకు గుంపు కూడారబ్బా'...అనుకున్నాడు ముకుందరావు.

అప్పుడే గుంపులో జేరిన మరో మనిషి ముకుందరావునే అడిగాడు...ఏమైందండీ.." అని.

"ఏమో..." అన్నాడు ముకుందరావు.

మరి కాస్సేపటికి నెమ్మదిగా సందు దొరికింది. ముకుందరావు గుంపుముందుకెళ్ళాడు.

సరిగ్గా డ్రైనేజి మేన్‌హోలు దగ్గరున్నాడు. ఆ మేన్‌హోలు ఎత్తుకి వో చెయ్యి, నడుం పై భాగం ఆంచి వుంది. పడుకున్నట్టులేదు... కూచున్నట్టూ లేదు. మెడ వో పక్కకి వాలిపోయింది. వో కాలు సగం ముడిచుంది. మరో కాలు, చెయ్యి పూర్తిగానేలకి అంటుకు పోయి యించుమించు నిర్జీవంగా వున్నాయి.

"అబ్బ..." అనుకున్నాడు ముకుందరావు చూసి చూడగానే.

వొంటిమీద బట్టల్లేవు...నడుం దగ్గర మాత్రం అదే బట్టో ఆనమాలు పట్టలేని

స్థితిలో ఓ గుడ్డుంది. అదైనా అస్తవ్యస్తంగా అంతంత మాత్రంగానే వుంది.

నలభై ఏళ్ళు దాటినట్టున్న ఆ ఆకారం వేపు రెండు క్షణాలు చూశాడు ముకుందరావు.

డ్రైనేజీలోంచి పైకి పొర్లి పోయిన నీళ్ళలో కాలు తడుస్తున్నా కదలిక లేదు. కర్రలా బిగుసుకు పోయున్నాడు. చాలా చోట్ల చిట్లిపోయిన చర్మం...బాగా పెరిగిన గడ్డం... కొద్దిగా రేఖలా తెరుచుకు నున్న వో కన్ను...వాలి పోయిన మెడా...వీటన్నిటి కన్నా దారుణంగా సగం వొంటినిండా పాకుతున్న చీమలు...గబుక్కున ముఖం తిప్పేసుకున్నాడు ముకుందరావు. ఆ దారుణం చూస్తూ యింక అక్కడ వుండలేక పోయాడు.

గుంపులోంచి బైటికి వస్తూ చాలా మంది ముఖాలు చూశాడు ముకుందరావు. చాలా ముఖాలు గడ్డ కట్టిన రాళ్ళలా కనిపించాయి. ఆ రాళ్ళలో కేవలం ఆ దృశ్యాన్ని చూస్తున్న ఒకే రకం చాలా కళ్ళు కనిపించాయి.

ఎవరో యీ ఆకారం... ఎవరో యీ మనిషి అనిపించలేదు ముకుందరావుకి... 'ఏమిటిది...' అనిపించింది. వో వంద గజాలు నడిచే వరకు తనెవరో, తనేమిటో, ఎటు నడుస్తున్నాడో కూడా తెలియలేదు.

ఆఫీసు దగ్గర పడుతుండగా, లోపలికి వెళ్ళబోతుండగా ఆ ఆకారం మళ్ళీ గుర్తొచ్చింది.

ఎక్కడో అట్టడుగు వోపికతోటో... కొన ప్రాణంతోటో...చీమల బాధతోటో వూగుతున్న ఆ ఆకారం మెద గుర్తొచ్చింది.

'మైగాడ్...' అనుకున్నాడు ముకుందరావు.

x x x x

ఆఫీసులో ఆరోజు ఎక్కువ పనిలేదు. కానీ ఏదో పని కల్పించుకొనేనా చెయ్యాలనిపించింది ముకుందరావుకి. మెదడంతా కుంచించుకు పోయినట్టుంది. ఏది ఆలోచించినా యిబ్బందిగానే వుంది. ఎన్నో మైళ్ళ లోతున్న గోతిలో నిలబడి మెడ పైకెత్తి, చిన్న ముక్కలా కనబడుతున్న ఆకాశాన్ని చూస్తున్నంత యిరుగ్గా వుంది.

'ఏమయ్యాడో...ఆఫీసుకి రాకుండా అక్కడే వుండి చూడాల్సింది' అనుకున్నాడు ముకుందరావు అయిదారుసార్లు...

నాలుగవుతుండగా, చివరికి యింక ఆఫీసులో వుండలేక పర్మిషనడిగి బైటికొచ్చేశాడు ముకుందరావు.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత సర్ విక్టర్ హ్యూగో 'లెస్ మిజరబుల్స్' అనే తన నవలలో, ఒకచోట ఎనిమిది వందల యిరవై మూడు పదాలతో తొంభై మూడు కామాలతో, యాభై ఒక్క సెమికోలన్లతో ఒకే ఒక్క వాక్యం వ్రాశాడు. అది యించుమించుగా మన ప్రజాతంత్రలో నాలుగు పేజీలకు పైగా వస్తుంది. ఇంత వరకు వెలువడిన ప్రపంచ సాహిత్యం మొత్తం తిరగవేసినా యింతకంటె పెద్ద వాక్యం మరొకటి మనకు కనిపించదు.

ఆ వోవర్ బ్రిడ్జి వరకూ పరుగులా నడిచిన ముకుందరావు అక్కడికి రాగానే గుండె బిగబట్టినట్టు ఆగిపోయాడు.

బ్రిడ్జి దాటగానే చూశాడు...గుంపు అలాగే వుంది.

'అయితే యింకా చచ్చిపోలేదా...యింకా అలాగే కర్రలా బిగుసుకుపోయి మరణబాధ పడుతున్నాడా...' అనుకున్నాడు ముకుంద రావు.

అలా అనుకోగానే వొళ్ళు ఒక్కసారి జలదరించింది'...ఛ...ఛ...ఏమిటీ వెధవ ఆలోచన...' అనుకున్నాడు.

ఆత్రంగా గుంపులో దూరబడి చూశాడు.

ప్రొద్దునవున్న చోటునుంచి వో అర అడుగు ముందుకు వొచ్చి వుంది ఆ ఆకారం. పూర్తిగా వొరిగి పోయింది. కానీ భూమికి పూర్తిగా ఆనకుండా అలాగే కర్రలా వుండి పోయింది.

'చచ్చి పోయాడా...'అన్నాడు ముకుంద రావు.

''ఆ...యిందాకా ఎవరో దగ్గరికెళ్ళి శ్వాస కూడా చూశారు....ఆట్టం లేదు...'' అన్నారు పక్కనుంచి ఎవరో.

'హమ్మయ్య...' అనిపించింది ముకుంద రావుకి. అతనికి తెలియకుండానే తేలిగ్గా శ్వాస వొదిలాడు. తెలిసింతర్వాత మళ్ళీ భయపడ్డాడు. 'ముక్కూ ముఖం తెలియని మనిషి...ఏరకం సంబంధంలేని మనిషి తొందరగా చచ్చిపోవాలని కోరుకోటం ఎంత దారుణం...' అనుకున్నాడు.

ఆ ఆలోచనే యిబ్బందిగా వుంది...అమా నుషంగా వుంది. ముకుందరావుకి యింక అక్కడ వుండబుద్ధి కాలేదు. అక్కడనుంచి కదలబుద్ధి కాలేదు. ఎటూ తేల్చుకోలేక అలాగే నిలబడ్డాడు.

''నేను ప్రొద్దున్నే అనుకున్నాను. వెంటనే చచ్చిపోతే బావుణ్ణని...ఆ మరణ బాధ ఎవరూ చూశ్ళేరు, ప్రొద్దున్న చూస్తే పిచ్చెక్కినట్టయింది...ఏదేనా రాయి తీసుకుని ఎవరేనా వెంటనే చంపేస్తే బావుణ్ణనిపిం చింది...''

ఆ మాటలు విని గబుక్కున తల తిప్పి చూశాడు ముకుందరావు. పొద్దున గుంపులో చూసిన ముఖమే. పొద్దున్న కనిపించినట్టు నల్ల రాయిలా కనపళ్ళేదు. యీ సారి...

నెమ్మదిగా గుంపుని తప్పించుకుని బైటి కొచ్చేశాడు ముకుందరావు.

జీవితమంతా ఆత్రపడి, కంగారు పడి... ఆశపడి, నిరాశపడి...చివరికి యిలా... యింత దారుణంగా, చావటానికేనా సరైన చోటులేక ఎంతమంది చస్తున్నారో...ఎంత మంది ఎన్నిచోట్ల తనలాగే యిలాంటివి చూసి తొందరగాచచ్చిపోతే బావుణ్ణనుకుంటు న్నారో...' అనిపించింది ముకుందరావుకి.

జైపూర్‌లోని "ప్రేమ్ ప్రకాష్" థియేటర్‌లో పేదవారికోసం ప్రత్యే కంగా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకు ఒక చిత్ర ప్రదర్శన ఉంటుంది. రేట్లు : ఆఖరి తరగతి 25 పైసలు. బాల్కనీ: ఒక రూపాయి.